సాక్షి
నిజామాబాద్

బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025



కత్తెర పోట్ల కలకలం..
ధర్పల్లి గ్రామానికి చెందిన కోటగిరి దాను అనే వ్యక్తి కత్తెరతో తల్లీకూతుళ్లతోపాటు మరో ముగ్గురిపై దాడి చేశాడు.
- 8లో ▸



నష్టం అంచనాను..
భారీ వర్షాలకు నష్టపోయిన పంటల వివరాల నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.9 /21.1

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

కాళేశ్వరంపై విచారణ సిగ్గుచేటు



నిజామాబాద్‌అర్బన్‌: కాళేశ్వరంపై సీబీఐ విచారణ సిగ్గుచేటు అని బీఆర్‌ఎస్‌ నాయకులు విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌ చౌరస్తాలో మంగళవారం బీఆర్‌ఎస్‌ నాయకులు నిరసన తెలిపారు. కాంగ్రెస్‌ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కేసును సీబీఐకి ఇస్తున్నారని ఆరోపించారు.

రేపు కామారెడ్డి జిల్లాకు సీఎం రాక!



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : భారీ వర్షాలతో అతలాకుతలమైన కామారెడ్డి జిల్లాలో సీఎం రేవంత్‌ రెడ్డి గురువారం పర్యటించనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం సీఎం పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమైంది. అయితే ఎక్కడెక్కడ పర్యటిస్తారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. వర్షాల ప్రభావం ఎలా ఉంటుందన్నదాని ఆధారంగా సీఎం పర్యటన ఉండే అవకాశాలున్నాయి. జిల్లాలో ఇటీవల భారీ వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని సీఎం ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, మహ్మద్‌నగర్‌ మండలాలతో పాటు కామారెడ్డి పట్టణంలో సీఎం పర్యటన ఉండే అవకాశాలున్నాయి.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద



బాల్కొండ: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లో నిలకడగా లక్షా 50 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్‌ గోదావరిలోకి నీటి విడుదలను చేపడుతున్నారు. 29 వరద గేట్ల ద్వారా లక్షా 25 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్‌ నుంచి వరద కాలువ ద్వారా 18 వేల క్యూసెక్కులు, కాకతీయకాలువ ద్వారా 4500, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 3500, మిషన్‌ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090(79.89 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

నిజాంసాగర్‌లోకి..
నిజాంసాగర్‌: కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న వర్షాలకు సింగూరు ప్రాజెక్టు ద్వారా నిజాంసాగర్‌ ప్రాజెక్టులోకి భారీ వరద వస్తోంది. మంగళవారం 80,204 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

కవిత సస్పెన్షన్‌..

గులాబీ దండులో గందరగోళం



బీఆర్‌ఎస్‌ కీలక నాయకురాలు, అధినేత తనయ కల్వకుంట్ల కవితపై సస్పెన్షన్‌ వేటు వ్యవహారం జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. తెలంగాణ జాగృతి, బీఆర్‌ఎస్‌ను రెండు కళ్లలా భావించిన కవితక్క అనూహ్యంగా పార్టీ నుంచి బయటికి వచ్చే పరిస్థితులు ఏర్పడడంతో ఆమె అనుచరులు డైలామాలో పడ్డారు.

- బహిరంగంగా వ్యాఖ్యలు చేయలేకపోతున్న బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు, కవిత అనుచరులు
- నిజామాబాద్‌ స్థానిక సంస్థల ఎన్నికల ఎమ్మెల్సీ కావడంతో చర్చోపచర్చలు
- నేడు కవిత ప్రెస్‌మీట్‌ నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: నిజామాబాద్‌ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ కుమార్తె కవితను పార్టీ నుంచి సస్పెండ్‌ చేసిన విషయమై జిల్లాలో రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. బీఆర్‌ఎస్‌ శ్రేణులు కొంతమేరకు గందరగోళంతో ఉండగా, కవిత అనుచరుల్లో కలకలం నెలకొంది. కవితతో మొదటి నుంచి సన్నిహితంగా ఉంటూ వచ్చిన, పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్న కొందరు ఉద్యమకారులు మాత్రం డెలామాలో ఉన్నారు. పార్టీ వైపు ఉండాలా.. కవిత వైపు వెళ్లాలా..? తేల్చుకోలేక సందిగ్ధంలో ఉన్నట్లు చెబుతుండడం గమనార్హం. అయితే కొందరు బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు 'మేము కేసీఆర్‌కు మాత్రమే విధేయులం.. ఇంకెవ్వరికీ కాదు.. ఇదే ఫైనల్‌', 'ఇగ చాలు.. శత్రువు చేతిలో పావుగా మారి నీ కుటుంబానికి కాదు.. తెలంగాణ కుటుంబానికి నష్టం చేస్తున్నావు' అంటూ సోషల్‌ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. 'ఇది కదా కేసీఆర్‌ అంటే.. ఎంతటి రక్త సంబంధీకులైనా పార్టీకి వ్యతిరేకంగా పనిచేసేవారి పట్ల ఇదే మంచి నిర్ణయం' అని పోస్టులు పెడుతున్నారు. 'కన్నకూతురు కంటే కష్టంలో ఉన్న పార్టీకి అండగా ఉన్న కార్యకర్తల భవిష్యత్తు ముఖ్యమని, కేసీఆర్‌ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని, పార్టీ కంటే ఎవరూ పెద్దవారు కాదనేది ఈ నిర్ణయంతో స్పష్టమైందని అంటున్నారు. ఆనాడు తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ కేసీఆర్‌ ఇప్పుడు పార్టీ కోసం కన్నబిడ్డను కూడా వదులుకుని గొప్ప నాయకుడైనట్లు సోషల్‌ మీడియాలో గులాబీ కార్యకర్తలు పోస్టులు చేస్తున్నారు. మరో వైపు కవిత అనుచరులు, సన్నిహితులు మాత్రం 'జయహో కవితక్క.. కవితక్క వెంటే నా ప్రయాణం' అంటూ పోస్టులు పెడుతున్నారు. కవితకు అనుకూలంగా పాటలు పెడుతున్నారు.



నిజామాబాద్‌ బీఆర్‌ఎస్‌ కార్యాలయం వద్ద కవిత ఫొటోపై స్టిక్కర్‌ అతికించిన దృశ్యం

ఎంపీ నుంచి సస్పెన్షన్‌ దాకా..

నిజామాబాద్‌ నుంచి 2014లో ఎంపీగా గెలుపొందిన కవిత 2019లో అర్వింద్‌పై ఓడిపోయారు. జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలే కవిత ఓటమిలో కీలక పాత్ర పోషించినట్లు ఇప్పటికీ పలువురు చెబుతున్నారు. తరువాత కాలంలో కవిత స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2023లో బీఆర్‌ఎస్‌ అధికారాన్ని కోల్పోయాక కవిత జిల్లాకు రావడం తగ్గిస్తూ వచ్చారు. ఈ క్రమంలో లిక్కర్‌ కేసులో అరెస్టు అయి ఢిల్లీలో తీహార్‌ జైలుకు వెళ్లారు. తరువాత కవిత కేసీఆర్‌కు రాసిన లేఖ బయటకు లీక్‌ అయినప్పటి నుంచి పార్టీలో గందరగోళ వాతావరణం నెలకొంది. అప్పటి నుంచి కవిత జాగృతి కార్యకలాపాలను ముమ్మరం చేసేందుకు కృషి చేస్తూ వచ్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో సింగరేణి టీబీజీకేఎస్‌ గౌరవాధ్యక్షురాలి పదవి నుంచి కవితను తప్పించడం ద్వారా పార్టీ శ్రేణుల్లో చర్చకు తావిచ్చింది. టీబీజీకేఎస్‌ పదవి దూరమైన వెంటనే సింగరేణిలో హెచ్‌ఎంఎస్‌ కార్మిక సంఘానికి గౌరవాధ్యక్షురాలిగా కవిత నియామకం కావడం గమనార్హం. ఇదిలా ఉండగా తాజాగా కాళేశ్వరం కేసును రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించేందుకు నిర్ణయించింది. కాళేశ్వరం అవినీతిలో హరీశ్‌రావు, సంతోష్‌ రావుల పాత్రే ఉందని, వీళ్ల కారణంగానే కేసీఆర్‌ పరువు పోతోందని కవిత ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలు చేసిన కొన్ని గంటల్లోనే కవితను పార్టీ నుంచి సస్పెండ్‌ చేస్తున్నట్లు ప్రకటన వచ్చింది. కవిత తెలంగాణ జాగృతి పేరుతో పార్టీ పెట్టనున్నట్లు చర్చ జరుగుతోంది. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు మీడియా సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కవిత చెప్పడంతో బీఆర్‌ఎస్‌ శ్రేణులు, కవిత అనుచరులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తి నెలకొంది. కవిత ఏ నిర్ణయం తీసుకుంటారోననే విషయమై ఆసక్తి నెలకొంది. నిజామాబాద్‌ స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి రాజీనామా చేస్తారా ? అంటూ వివిధ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఆమె పదవీ కాలం మూడున్నరేళ్లు ఉంది. ఈ ఎపిసోడ్‌ బీఆర్‌ఎస్‌ అంతర్గత వ్యవహారమని పీసీసీ చీఫ్‌ మహేశ్‌కుమార్‌గౌడ్‌ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.



సాలూర మండలం సాలంపాడ్‌ క్యాంప్‌లో వైఎస్‌ఆర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

మదిలోనే మహానేత..

పేదల సంక్షేమం కోసం పరితపించిన గొప్ప నాయకుడు.. అభివృద్ధిని పరుగులు పెట్టించి రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ఎన్నటికీ తమ మదిలోనే ఉంటారని, ఆయనలేని లోటు పూడ్చలేనిదని అభిమానులు అంటున్నారు. మహానేత వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు జిల్లా వ్యాప్తంగా మంగళవారం నివాళులు అర్పించారు.

పార్టీకి కవిత నష్టం కలిగించారు



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌

- ఆమె ఆరోపణలను ఎవరూ పట్టించుకోవడం లేదు
- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌

నిజామాబాద్‌అర్బన్‌: ఎమ్మెల్సీ కవిత పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేయడంతోనే కేసీఆర్‌ ఆమెపై సస్పెన్షన్‌ వేటు వేశారని నిజామాబాద్‌ రూరల్‌ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హరీశ్‌రావు, సంతోష్‌రావుపై కవిత చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. కవిత సస్పెన్షన్‌ విషయంలో పార్టీ సరైన నిర్ణయం తీసుకుందని, కేసీఆర్‌ తన కూతురు కన్నా పార్టీ భవిష్యత్‌ ముఖ్యమని ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. కవిత ఆరోపణలను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఎంపీగా కవిత జిల్లాకు ఎన్నో సేవలు అందించినప్పటికీ పార్టీ సిద్ధాంతాలు, నియమాలకు వ్యతిరేకంగా పనిచేయడంతో చర్యలు తప్పలేదన్నారు. ఈ వ్యవహారం స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపబోదని స్పష్టం చేశారు. బీజేపీ, కాంగ్రెస్‌ కుట్రలో భాగంగానే కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగించడమని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ తెలంగాణను ఎంతో అభివృద్ధి చేసి దేశంలోనే నంబర్‌వన్‌ స్థానంలో నిలిపారని అన్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు రాజు, నుడా మాజీ చైర్మన్‌ ప్రభాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌, తదితరులు పాల్గొన్నారు.

కవిత ఫొటో కనిపించకుండా స్టిక్కర్‌
బీఆర్‌ఎస్‌ జిల్లా కార్యాలయంలో అధినేత కేసీఆర్‌, కేటీఆర్‌, కవిత చిత్రాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కవిత ఫొటో కనిపించకుండా స్టిక్కర్‌ అతికించారు. పార్టీ సస్పెన్షన్‌ వేటు వేయడంతో స్టిక్కర్‌ వేశారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

- ఇందిరమ్మ లబ్ధిదారులు పనులు ప్రారంభించేలా చొరవ చూపాలి
- సమీక్షలో కలెక్టర్‌ టి.వినయ్‌ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివద్ధి పనులను తక్షణమే ప్రారంభించి శరవేగంగా పూర్తి చేయించాలని కలెక్టర్‌ టి వినయ్‌ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. నిజామాబాద్‌ నగర పాలక సంస్థతోపాటు బోధన్‌, ఆర్మూర్‌, భీమ్‌గల్‌ మున్సిపాలిటీల్లో డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లకు సంబంధించిన పెండింగ్‌ పనులను పూర్తి చేయాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్‌ హాల్‌లో మంగళవారం అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌ కుమార్‌, ఇతర అధికారులతో ఇందిరమ్మ ఇళ్లు, డబుల్‌ బెడ్‌ రూం ఇళ్ల అసంపూర్తి పనులు, పెండింగ్‌లో ఉన్న ఇతర అభివృద్ధి పనులపై కలెక్టర్‌ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్‌ అమలులోకి వచ్చే నాటికే సాధ్యమైనంత వరకు పెండింగ్‌ పనులను పూర్తి చేసి, ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇళ్లు మంజూరైన వారు వెంటనే మార్కింగ్‌ చేసుకుని నిర్మాణ పనులు చేపట్టేలా చొరవచూపాలన్నారు. లబ్ధిదారులకు ఐకేపీ, మెప్మా ద్వారా విరివిరిగా రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్‌వాడీ సెంటర్ల భవనాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఒక్కో శాఖ వారీగా పనుల ప్రగతిని కలెక్టర్‌ సమీక్షిస్తూ, అధికారులకు సూచనలు చేశారు. జెడ్పీ సీఈవో సాయాగౌడ్‌, హౌసింగ్‌ పీడీ పవన్‌కుమార్‌, డీపీవో శ్రీనివాస్‌, డీఎంహెచ్‌వో రాజశ్రీ పాల్గొన్నారు.

శోభాయాత్రకు ఆటంకాలు కలగొద్దు

- ప్రశాంత వాతావరణంలో గణేశ్‌ నిమజ్జనోత్సవాన్ని నిర్వహించాలి
- కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య
- జిల్లా కేంద్రం నుంచి యంచ, ఉమ్మెడ గోదావరి వరకు రూట్‌ పరిశీలన



నిజామాబాద్‌లోని వినాయకుల బావిని పరిశీలిస్తున్న అర్బన్‌ ఎమ్మెల్యే, కలెక్టర్‌, సీపీ



ఉమ్మెడ బ్రిడ్జి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్‌ టి.వినయ్‌ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య

నిజామాబాద్‌అర్బన్‌/నవీపేట/నందిపేట్‌: ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ గణేశ్‌ నిమజ్జనోత్సవాన్ని జరుపుకోవాలని కలెక్టర్‌ టి.వినయ్‌ కృ ష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ప్రత్యేక బస్సులో పోలీస్‌ కమిషనర్‌ పి.సాయిచైతన్యతోపాటు ఇతర అధికారులతో కలిసి ప్రయాణిస్తూ శోభాయాత్ర రూట్‌ను కలెక్టర్‌ పరిశీలించారు. నిజామాబాద్‌ నగరంలోని వినాయకబావి వద్ద అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ, సార్వజనిక్‌ గణేశ్‌ మండలి ప్రతినిధులతో కలిసి నిమ్మజన ఏర్పాట్లపై చర్చించారు. నిమజ్జన శోభాయాత్రకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా కలెక్టర్‌ వెల్లడించారు. యంచ, నందిపేట మండలం ఉమ్మెడ గోదావరి బ్రిడ్జీల వద్ద నది ప్రవాహాన్ని పరిశీలించారు. అక్కడక్కడ చెడిపోయిన రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని పంచాయతీరాజ్‌, ఆర్‌ అండ్‌ బీ అధికారులను కలెక్టర్‌ ఆదేశించారు. శోభాయాత్రకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా రోడ్లకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్‌ తీగలను పైకి బిగించాలని సూచించారు. ఎనిమిది అడుగులకు పైగా ఎత్తున్న ప్రతిమలను నందిపేట మండలం ఉమ్మెడ గోదావరి బ్రిడ్జి వద్దకు తరలించి నిమజ్జనం చేయాలన్నారు. గోదావరి బ్రిడ్జిల క్రేన్‌లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, లైటింగ్‌ సౌకర్యం కల్పించాలన్నారు. వారి వెంట అదనపు కలెక్టర్‌ అంకిత్‌, కిరణ్‌కుమార్‌, ఆర్మూర్‌ సబ్‌ కలెక్టర్‌ అభిజ్ఞాన్‌ మాల్వియా, భైంసా డివిజన్‌ సబ్‌ కలెక్టర్‌ సంకేత్‌ కుమార్‌, అదనపు డీసీపీ బస్వారెడ్డి, నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌, నగర పాలక సంస్థ కమిషనర్‌ దిలీప్‌ కుమార్‌, ఏసీపీలు రాజా వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌ రెడ్డి, మస్తాన్‌ రావు, మున్సిపల్‌, ఆర్‌ అండ్‌ బీ, అగ్నిమాపక, ఫిషరీస్‌, పంచాయతీరాజ్‌, రెవెన్యూ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

గ్రామపంచాయతీ ఓటర్లు 8,51,417

- తుది ఓటరు జాబితా విడుదల



సుభాష్‌నగర్‌: గ్రామ పంచాయతీలకు సంబంధించి తుది ఫొటో ఓటరు జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారులు మంగళవారం విడుదల చేశారు. జాబితా ప్రకారం 8,51,417 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 3,96,778 మంది పురుషులు, 4,54,621 మంది మహిళలు, 18 మంది ఇతరులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లో 545 గ్రామ పంచాయతీలు, 5022 వార్డు స్థానాలు ఉన్నాయి. గత నెల 28న డ్రాఫ్ట్‌ ఓటరు జాబితా విడుదల చేయగా, గత నెల 28 నుంచి 30 వరకు అభ్యంతరాలు స్వీకరించారు. 31న అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించారు. జిల్లాలో అత్యధికంగా డిచ్‌పల్లిలో 46,893 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా చందూర్‌ 8,816 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం వార్డు వారీగా తుది ఓటరు జాబితా, పోలింగ్‌ స్టేషన్ల జాబితాలను అన్ని గ్రామపంచాయతీల్లో, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రదర్శించామని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు.

మహిళా ఓటర్లే అధికం..
అన్ని మండలాల్లో అధికంగా ఉన్న మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. జిల్లా వ్యాప్తంగా 57,843 మంది మహిళా ఓటర్లు పురుషుల కంటే అధికంగా ఉన్నట్లు తుది ఓటరు జాబితా ప్రకారం వెల్లడైంది.

ఆర్మూర్‌ డివిజన్‌

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆలూర్‌	10,999	13,135	--	24,134
ఆర్మూర్‌	14,161	16,654	01	30,816
బాల్కొండ	12,012	13,919	--	25,931
భీమ్‌గల్‌	18,183	21,087	01	39,271
డొంకేశ్వర్‌	7,696	9,064	--	16,760
జక్రాన్‌పల్లి	16,527	19,189	--	35,716
కమ్మర్‌పల్లి	13,824	16,061	--	29,885
మెండోరా	9,797	11,385	01	21,183
మోర్తాడ్‌	12,740	14,903	--	27,643
ముప్కాల్‌	7443	8730	--	16,173
నందిపేట్‌	19,416	22835	03	42,254
వేల్పూర్‌	17,139	20,337	--	37,476
ఏర్గట్ల	6,710	7,793	--	14,503
మొత్తం	1,66,647	1,95,092	06	3,61,745

బోధన్‌ డివిజన్‌

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
బోధన్‌	14,895	16,198	02	31,095
చందూర్‌	4,252	4,564	--	8816
కోటగిరి	9105	10,036	01	19,142
మోస్రా	4899	5527	01	10,427
పోతంగల్‌	10,488	11,318	01	21,807
రెంజల్‌	14,397	15,638	01	30,036
రుద్రూర్‌	8,217	9,197	--	17,414
సాలూరా	8,402	9,199	--	17,601
వర్ని	12,820	13,986	--	26,806
ఎడపల్లి	14,820	16,928	01	31,749
మొత్తం	1,02,295	1,12,591	07	2,14,893

నిజామాబాద్‌ డివిజన్‌

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ధర్పల్లి	15,123	17,424	--	32,547
డిచ్‌పల్లి	21,813	25,080	--	46,893
ఇందల్వాయి	14,378	16,541	01	30,920
మాక్లూర్‌	14,249	16,645	--	30,894
మోపాల్‌	14,160	16,645	--	30,805
నవీపేట్‌	21,495	24,822	--	46,317
నిజామాబాద్‌ రూరల్‌	10,349	11,639	04	21,992
సిరికొండ	16,269	18,142	--	34,411
మొత్తం	1,27,836	1,46,938	05	2,74,779

జిల్లా మొత్తం	పురుష ఓటర్లు : 3,96,778	మహిళ ఓటర్లు : 4,54,621	ఇతరులు : 18	మొత్తం : 8,51,417

సబ్సిడీపై సంచార వాహనాలు

- ఎస్‌హెచ్‌జీ మహిళలకు అందిస్తున్న ప్రభుత్వం
- తొలి విడతగా జిల్లాలో ఇద్దరికి..
- దశల వారీగా మంజూరు చేసేందుకు ప్రణాళిక



జిల్లాకు చెందిన లబ్ధిదారు గంగామణికి సంచార వాహనాన్ని అందజేస్తున్న మంత్రి సీతక్క (ఫైల్‌)

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): ఎస్‌హెచ్‌జీ మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలందించి ఆర్థిక తోడ్పాటునందిస్తుండగా.. మహిళాశక్తి కార్యక్రమం కింద సంచార చేపల విక్రయ వాహనాలను 60శాతం సబ్సిడీపై అందజేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాకు రెండు యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నెల 1వ తేదీన హైదరాబాద్‌లో మంత్రి సీతక్క లబ్ధిదారులకు వాహనాలను అప్పగించారు. ఆర్మూర్‌ మండలం ఫత్తేపూర్‌కు చెందిన తొండాకూర్‌ లావణ్య, నిజామాబాద్‌ మండలం మల్లారం గ్రామానికి చెందిన దుబ్బాక గంగామణి వాహనాలు పొందిన వారిలో ఉన్నారు. ఒక్కో వాహనం విలువ రూ.10 లక్షలు కాగా, ప్రభుత్వం రూ.6లక్షలు సబ్సిడీ పోను మిగతా రూ.4 లక్షలు లబ్ధిదారులు చెల్లించారు. లబ్ధిదారుల వాటా డబ్బులకు కూడా గ్రామీణాభివృద్ధి శాఖ రుణం అందజేసింది. ఈ సంచార చేపల విక్రయ వాహనాలను నియోజకవర్గానికి ఒకటి అందజేసి, దశల వారీగా మండలాల్లో కూడా ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోందని అధికారులు చెబుతున్నారు.

వాహనంతో వ్యాపారం..
ఎస్‌హెచ్‌జీ మహిళలు వ్యాపారం కోసం ఉపయోగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సబ్సిడీపై చేపల విక్రయ వాహనాలను అందిస్తోంది. చేపల రవాణాతోపాటు రోడ్‌సైడ్‌ బిజినెస్‌ చేసుకునేందుకు వీలుగా అన్ని సదుపాయాలు ఇందులో సమకూర్చింది. చేపల ఫ్రై, కూరలు వండి విక్రయించేందుకు ప్రత్యేకంగా కిచెన్‌ కిట్‌, ఫ్రిడ్జ్‌, వాటర్‌, ఐస్‌ బాక్సులు, ఇన్వర్టర్‌తో విద్యుత్‌ సౌకర్యం ఉన్నాయి. వ్యాపారంలో నైపుణ్యం పొందేందుకు మహిళలకు శిక్షణ కూడా ఇస్తున్నారు. సంచార వాహనాలు కావాలనుకునే ఎస్‌హెచ్‌జీ మహిళలు ఐకేపీకి సంబంధించిన మండల, జిల్లా కార్యాలయాల్లో అధికారులను సంప్రదిస్తే సరిపోతుంది. ఈ అవకాశాన్ని జిల్లాలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్‌ కోరారు.

క్లుప్తంగా

గంగపుత్రుల సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతి



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా గంగపుత్ర నాయకులు రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి శ్రీహరిని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గంగపుత్రుల సొసైటీల పరిధిలో ఉన్న చెరువుల్లో ఇతర కులస్తులకు అవకాశం కల్పించవద్దని, ఈ ఏడాది నాణ్యమైన చేప పిల్లలను త్వరగా పంపిణీ చేయాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ ఫిషరీష్ చైర్మన్ బోర్గాం శ్రీనివాస్, నగర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పల్లికొండ అన్నయ్య, మాజీ ఎంపీటీసీ రమేశ్ ఉన్నారు.

పీజీ సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న పీజీ, బీఈడీ, బీపీఎడ్, ఎంఈడీ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన పీజీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో మొత్తం 945 మందికి 902 మంది హాజరు కాగా 43 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రంలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఇద్దరు విద్యార్థులు డిబార్‌కు గురైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన బీపీఎడ్ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో మొత్తం 1455 మందికి 1387 మంది హాజరు కాగా 68 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే ఎంఈడీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 1,2,3,5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 32 మందికి 30 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరైనట్లు ప్రొఫెసర్ చంద్రశేఖర్ తెలిపారు.

తెయూ ఇంజినీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఇంజినీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్ ద్వారా 12 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి మంగళవారం తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌సీ కోర్సులో 57 మంది కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులో 15 మంది మొత్తం 72 మంది విద్యార్థులు చేరినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

నష్టం అంచనాను ప్రభుత్వానికి నివేదిస్తాం

- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- ఖాజాపూర్, హున్సా, మందర్నా శివారులో దెబ్బతిన్న పంటల పరిశీలన

బోధన్: భారీ వర్షాలకు నీట మునిగి నష్టపోయిన పంటల వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం మంజీర నది తీరంలో సాలూర మండలంలోని ఖాజాపూర్, హున్సా, మందర్నా శివారులో వరద నీట మునిగి దెబ్బతిన్న పంటలను వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. పంట నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. మందర్నా శివారులో పంట పొలాల మధ్య దెబ్బతిన్న పొతంగల్ మండలంలోని సుంకిని వెళ్లే రోడ్డును పరిశీలించారు. మంజీర, గోదావరి నదులకు ఒకే సమయంలో భారీ వరద చేరి ఉధృతంగా ప్రవహించడం వల్ల పరీవాహక ప్రాంతంలో నియోజక వర్గంలోని సాలూర, బోధన్, రెంజల్, నవీపేట మండలాల్లో పంటలు నీట మునిగి నష్టం వాటిల్లిందని అన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఉధృతిని నిలువరించేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేశారని పేర్కొన్నారు. నియోజక వర్గంలో సోయా 14 వేలు, వరి పంట 18 వేల ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపడతామన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, డీఏవో గోవింద్, ఏసీపీ శ్రీనివాస్, ట్రాన్స్‌కో డీఈ ముక్తార్, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో శ్రీనివాస్, మండల నాయకులు మందర్నా రవి, అల్లె రమేశ్, ఇల్తెపు శంకర్, చిద్రపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



హున్సా శివారులో వరద నీటితో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

రెంజల్/ నవీపేట్: ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో నీట మునిగిన వరి, సోయా పంటలను సోమవారం రుద్రూర్ ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన స్థానం శాస్త్ర వేత్తలు పరిశీలించారు. రెంజల్ మండలం తాడ్‌బిలోలి, బోర్గాం, కందకుర్తి, నవీపేట మండలంలోని నందిగామ, అల్జాపూర్ గ్రామాలను సందర్శించి వరి రైతులకు సూచనలు, సలహాలు అందించారు. వరద నీటిలో ముంపునకు గురైన పొలాలకు మురుగు నీటి కాల్వల ద్వారా నీటిని తీసి వేసుకోవాలని రుద్రూర్ పరిశోధనా స్థానం అధిపతి సమతా పరమేశ్వరి, శాస్త్ర వేత్తలు సాయిచరణ్, రమ్యారాథోడ్ సూచించారు. పలు అంశాలపై సూచనలు చేశారు. వారి వెంట రెంజల్ మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి సిద్ధిరామేశ్వర్, నవీపేట ఏవో నవీన్‌కుమార్, ఏఈవోలు, రైతులు ఉన్నారు.



బోర్గాం శివారులో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం

నిజామాబాద్ నాగారం: సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధమని సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ సలీం అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సమాచార హక్కు చట్టం – 2005 పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. చట్టం పరిధిని అంతర్జాతీయ స్థాయిలో విస్తరించాలన్నారు.

జిల్లా కార్యవర్గం

సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా కాంతపు గంగాధర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా వై సునీత, న్యాయ విభాగం సలహాదారులుగా శ్యామల, కార్యదర్శిగా రషీదా, ముఖ్య సలహాదారులుగా మహ్మద్, బోధన్ డివిజన్ అధ్యక్షురాలిగా తస్లీమ్, రాష్ట్ర స్పోక్స్ పర్సన్‌గా న్యాయవాది శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్ష

- ఆస్తి కోసం ఒకే కుటుంబంలోని ఆరుగురి హత్య
- పిల్లలను చంపిన కేసులో నిందితుడు, అతని తల్లికి గతంలో యావజ్జీవ కారాగార శిక్ష విధించిన కోర్టు
- ఇప్పుడు మరోసారి ముగ్గురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష

నిజామాబాద్ లీగల్: స్నేహితుని ఆస్తిని కాజేయాలన్న దురాశతో ఒకే కుటుంబంలోని ఆరుగురిని పథకం ప్రకారం హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి జీవీఎన్ భారత లక్ష్మి తీర్పు వెలువరించారు. వివరాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య మంగళవారం వివరాలు వెల్లడించారు.

జిల్లాలోని మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన నిందితుడు మేడిద ప్రశాంత్, రాచర్ల పూన ప్రసాద్ స్నేహితులు. ప్రశాంత్ తన అవసరం నిమిత్తం ప్రసాద్ వద్ద రూ. 3.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తర్వాతి కాలంలో ప్రసాద్ ఓ కేసులో ఇరుక్కోగా, అతను కేసు నుంచి బయటపడేందుకు ప్రశాంత్ సహకరించాడు. ఈ సందర్భంగా ప్రసాద్‌కు అప్పులయ్యాయి. దీంతో ప్రశాంత్‌ను తనకు ఇవ్వాల్సిన రూ. 3.50 లక్షలు ఇవ్వాలని అడగడంతో పాటు, మరిన్ని డబ్బులు అవసరం ఉన్నందున అప్పు ఇప్పించాలని కోరాడు. ఇదే అదునుగా భావించిన ప్రశాంత్ తాను ఐటీ రిటర్న్ దాఖలు చేస్తున్నందున తన పేరుతో అప్పు తీసుకుంటే ఎక్కువ మొత్తంలో రుణం వస్తుందని తెలిపాడు. అందువల్ల ప్రసాద్ ఇంటిని తన పేరు మీదకు మార్చాలన్నాడు. ప్రశాంత్ సూచన మేరకు ప్రసాద్ తన ఇంటిని అతని పేరుపై మార్చాడు. ఆస్తి తన పేరు మీదకు మారడంతో ప్రశాంత్ మనస్సులో దురాలోచన మెదిలింది. ప్రసాద్ కుటుంబాన్ని అంతం చేస్తే ఆ ఇంటిని సొంతం చేసుకోవడంతో పాటు తాను తీసుకున్న అప్పును సైతం ఎగ్గొట్టవచ్చని ఆలోచించాడు. ఈ విషయం ప్రశాంత్ తన తల్లికి, సోదరుడికి చెప్పగా వారు దానికి సరేనన్నారు. ప్రసాద్ కుటుంబాన్ని అంతమొందించేందుకు ప్రశాంత్, దుర్గానగర్ తండాకు చెందిన గుగులోత్ విష్ణుతో కలిసి పథకం రూపొందించాడు. వీరు మరో మైనర్ యువకుడిని సైతం పథకం అములులో భాగస్వామ్యం చేశారు. ఈ మధ్యలో ప్రసాద్ డబ్బుల కోసం ఒత్తిడి పెంచాడు. ప్రశాంత్ డబ్బులు ఇస్తానని చెప్పి ప్రసాద్‌ను నిజామాబాద్‌కు రప్పించి 29నవంబర్2023న మాక్లూర్ మండలం మదన్‌పల్లి శివారుకు తీసుకెళ్లాడు. మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి మద్యం తాగించి హత్యచేసి శవాన్ని పూడ్చిపెట్టారు. ఆ తర్వాత ప్రసాద్ కుటుంబ సభ్యులు భార్య సాన్విక, తల్లి సుశీల, ఇద్దరు పిల్లలు, ఇద్దరు సోదరీమణులను నిజామాబాద్ లోని ఓ లాడ్జిలో ఉంచి ఒక్కొక్కరిని అంత మొందించేందుకు పథకం రూపొందించారు.

ప్రసాద్‌ను చంపిన రెండ్రోజుల తర్వాత ప్రసాద్ భార్య సాన్విక అలియాస్ రమణిని ప్రసాద్ దగ్గరకు వెళ్దామంటు ప్రశాంత్ కారులో తీసుకెళ్లి, కారులోనే ఆమె మెడకు తాడు బిగించి హత్య చేశాడు. శవాన్ని బాసర వద్ద ఉన్న బ్రిడ్జి పై నుంచి గోదావరి నదిలోకి తోసి వేశాడు. ఈ రెండు కేసుల్లో మాక్లూర్, నవీపేట్ పోలీసు స్టేషన్ల పరిధిలో ఏ1, ఏ2, ఏ3లుగా ఉన్న మేడిద ప్రశాంత్, గుగులోత్ విష్ణు, ప్రశాంత్ తల్లి ఒడ్డెమ్మలకు కోర్టు మంగళవారం యావజ్జీవ కారగార శిక్ష విధించింది.

ఈ కేసులో నిందితుడు ప్రశాంత్ హతుడైన ప్రసాద్ ఇద్దరు పిల్లలు చైత్రిక, చైత్రక్, సోదరీమణులు స్వప్న, శ్రావణిలను కూడా హత్య చేశాడు. మెండోర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు పిల్లలను చంపిన రెండు కేసుల్లో ప్రశాంత్, అతని తల్లి ఒడ్డెమ్మలకు ఇప్పటికే యావజ్జీవ కారాగార శిక్ష పడగా, ప్రసాద్, సాన్వికను చంపిన కేసుల్లో కోర్టు ముగ్గురు నిందితులకు మరోసారి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. రెండు వేల జరిమానా విధించింది. వీటితో పాటు కిడ్నాప్ కేసులో ప్రశాంత్, విష్ణులకు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. రెండు వేల జరిమానా, శవాన్ని దాచిన కేసులో ఏ1, ఏ2లకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా, ఇంటి పత్రాలు రాయించుకుని చీటింగ్ చేసిన కేసులో ప్రశాంత్ తల్లి ఒడ్డెమ్మకు ఏడేళ్ల జైలు, రూ. వెయ్యి జరిమానా, ప్రసాద్ కుటుంబాన్ని బెదిరించిన కేసులో ముగ్గురు నిందితులకు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. ప్రసాద్ ఇద్దరు సోదరిమణులను చంపిన కేసులు కామారెడ్డి జిల్లాలోని సదాశివనగర్, మెదక్ జిల్లాలోని చేగుంట పోలీసు స్టేషన్లలో వీరిపై పెండింగ్ లో ఉన్నాయి. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు మైనర్లన్న కారణంగా శిక్షనుంచి తప్పించుకున్నారు. కేసు విచారణలో హతుడు ప్రసాద్ తల్లి సుశీల సాక్ష్యం, అద్దె కారు జీపీఎస్ ట్రాకర్ కీలకంగా మారింది.

మరోవైపు ప్రశాంత్ ఆరుగురిని హత్య చేసిన తర్వాత ప్రసాద్ తల్లి సుశీలను హత్య చేయాలని తలంచాడు. అయితే ఆమె లాడ్జి నుంచి తప్పించుకోవడంతో ఈ కేసులో కీలకంగా మారింది. ఆమె ఇచ్చిన సాక్ష్యంతో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష పడిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్ రెడ్డి తెలిపారు.

హెల్మెట్లు పంపిణీ చేసిన చిన్నారి

ఖలీల్‌వాడి: నగరంలోని గూపన్‌పల్లికి చెందిన బెన్నీ, మౌనికల కుమార్తె సంధి అద్విక ఐదవ జన్మదిన వేడుకల సందర్భంగా విశేషమైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అద్విక తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న పొదుపు డబ్బులను ఉపయోగించి మొత్తం 60 హెల్మెట్లను కొనుగోలు చేసి ట్రాఫిక్ పోలీసులకు అందజేసింది. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, సీఐ ప్రసాద్, నుడా చైర్మన్ కేశవేణు, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నరాల రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



● ఆఖరి మజిలీకి అవస్థలు

సిరికొండ: వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో మండలంలోని గడ్కోల్ గ్రామస్తులకు అవస్థలు తప్పడం లేదు. గ్రామంలో మంగళవారం ఓ వృద్ధురాలు మృతి చెందింది. వైకుంఠ ధామం వాగు అవతల వైపు ఉంది. అంత్యక్రియలకు వెళ్లడానికి వాగు దాటి వెళ్లాలి. వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడం, తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో మృతదేహంతో వాగు ప్రవాహంలోంచి నడుచుకుంటూ వెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.



మృతదేహంతో వాగులో నుంచి వెళ్తున్న గ్రామస్తులు

కాళేశ్వరం కొట్టుకుపోలేదు.. కూలిపోలేదు



కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన నేపథ్యంలో ఎక్కడ చూసినా ఇదే అంశంపై చర్చ సాగుతోంది. ఇదిలా ఉండగా.. 'కాళేశ్వరం కొట్టుకుపోలేదు.. కూలిపోలేదు' అంటూ బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. బాల్కొండ నియోజకవర్గానికి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా చేకూరిన మేలు చేకూరిందంటూ ఫ్లెక్సీల్లో పేర్కొన్నారు. ప్యాకేజీ 20, 21, 21ఏ(1), 21ఏ(2) పనుల కోసం రూ.6వేల కోట్లు, మెంట్రాజ్‌పల్లి పంప్‌హౌజ్ కోసం రూ.1,750 కోట్లు కేటాయించినట్లు అందులో వివరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డిల ఫొటోలను ప్రచురించారు.

– మోర్తాడ్(బాల్కొండ)

క్రైం కార్నర్

వాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పీఎస్ పరిధిలోని అమ్మ వెంచర్ న్యూ బ్రిడ్జి వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. మృతుడి వయస్సు 38 ఏళ్ల వరకు ఉంటుందని, అతని కుడి చేతిపై మీనాక్షి అని ఇంగ్లీష్‌లో పచ్చబొట్టు ఉందన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712659840, 8712659719 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

మూడోటౌన్ పరిధిలో..

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్ వెనుక భాగంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఉదయం రైల్వేస్టేషన్ వెనుక భాగంలో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు సుమారు 60 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712659839, 8712659717 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్: అత్యాచారం కేసులో ఓ నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షను జిల్లా ప్రత్యేక మహిళా కోర్టు విధించింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్‌కు చెందిన ఓ మహిళ బహిర్భూమికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన జంగం రాజశేఖర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆమె గర్భం దాల్చడంతో నిందితుడు ఆమెను బలవంతంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి గర్భస్రావం చేయించాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పర్చారు. విచారణలో నేరం చేసినట్లు రుజువు కావడంతో మహిళా కోర్టు జడ్జి హరీష నిందితుడికి సెక్షన్ 366(అపహరించడం) ప్రకారం ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. ఐదువేల జరిమానా, సెక్షన్ 376(2)(ఎస్) ప్రకారం అత్యాచారం చేయడం కింద పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. పదివేల జరిమానా, సెక్షన్ 417 ప్రకారం మోసం చేసినందుకు ఏడాది జైలు శిక్ష, రూ. ఐదువేల జరిమానా, బెదిరింపులు చేసినందుకు రెండేళ్ల జైలు శిక్ష, రూ. ఐదు వేల జరిమానా విధించారు. ఈ శిక్షలను పదేళ్ల పాటు ఏకకాలంగా విధించినట్లు జడ్జి పేర్కొన్నారు. నిందితుడి క్రూరత్వ కారణంగా బాధితురాలు శారీరకంగా, మానసికంగా బాధలకు గురైనందుకు జిల్లా న్యాయసేవా సంస్థ బాధితురాలికి రూ. ఐదు లక్షలు చెల్లించాలని జడ్జి సిఫార్సు చేశారు.

అంతర్ జిల్లా దొంగపై పీడీ యాక్టు నమోదు

కామారెడ్డి క్రైం: తరచూ దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్న లింగంపేట మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన అంతర్ జిల్లా దొంగ గారబోయిన శ్రీకాంత్ పై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర మంగళవారం తెలిపారు. నేరస్తుడైన శ్రీకాంత్ లింగంపేట మండలంలో ఇటీవల అమ్ముల లక్ష్మి అనే మహిళను ఆభరణాలు దోచుకోవడం కోసం హత్య చేసి పట్టుబడ్డాడు. గతంలోనూ అతనిపై దోపిడీలు, దొంగతనాలకు సంబంధించిన పలు కేసులు ఉన్నాయి. దీంతో అతనిపై పీడీ యాక్టు నమోదు చేశామని ఎస్పీ తెలిపారు. నేరస్తుడు శ్రీకాంత్ ప్రస్తుతం నిజామాబాద్ జైలులో ఉన్నాడు. పీడీ యాక్టు ఉత్తర్వులను ఎల్లారెడ్డి సీఐ రాజారెడ్డి మంగళవారం నేరస్తుడికి అందజేశారు. తరచూ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి వృద్ధురాలి మృతి

రుద్రూర్: మండల కేంద్రంలోని కాటి వాగులో ప్రమాదవశాత్తు వృద్ధురాలు పడి మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భిక్షాటన చేసే సరవ్వ (80) అనే వృద్ధురాలు మంగళవారం రాత్రి రెండు గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చింది. బస్టాండ్‌కు వెళ్లే క్రమంలో నూతనంగా నిర్మిస్తున్న వంతెనపై నుంచి వాగులో పడిపోయిందన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మృతదేహన్ని వెలికి తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధర్పల్లిలో కత్తెర పోట్ల కలకలం..

- ఒకరి మృతి, నలుగురికి గాయాలు



లక్ష్మి(ఫైల్)

ధర్పల్లి: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో మంగళవారం దారుణం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్పల్లి గ్రామానికి చెందిన కోటగిరి దాసు అనే వ్యక్తి టైలరింగ్ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతడికి భార్య గంగామణి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దాసుకు తన భార్యతో మనస్పర్థలు రావడంతో రెండేళ్ల క్రితం విడాకులు తీసుకున్నాడు. అతని భార్య గంగామణి ధర్పల్లిలోనే నివాసం ఉంటోంది. దాసు అదే గ్రామంలో ఓ ఆశ్రమంలో ఉంటున్నాడు. తన భార్య విడిపోవడానికి అదే గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ కారణమని ఆగ్రహించిన దాసు మంగళవారం ఉదయం లక్ష్మి ఇంటికెళ్లి కత్తెరతో ఆమె పై దాడి చేశాడు. అడ్డుగా వచ్చిన ఆమె కుమార్తె గౌతమి, అదే కాలనీకి చెందిన శెట్‌పల్లి నాగరాజు, అతని భార్య శోభ, మరో వ్యక్తి శెట్టిపల్లి భోజేశ్వర్ పై దాసు కత్తెరతో దాడి చేశాడు. దాడిలో తీవ్ర గాయాలైన లక్ష్మిని స్థానికులు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. గాయపడ్డ మరో నలుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. ఘటన స్థలాన్ని ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై కళ్యాణి పరిశీలించి వివరాలను సేకరించారు. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడి అరెస్ట్

- మధ్యప్రదేశ్ నుంచి వచ్చి జిల్లాలో దొంగతనాలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: మధ్యప్రదేశ్ నుంచి వచ్చి జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ ప్రమాదకర ముఠా సభ్యుడిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాజేశ్ చంద్ర కేసు వివరాలు వెల్లడించారు. గత జూలై 18న అర్ధరాత్రి సదాశివనగర్ మండలం మర్కల్‌లో తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీలు జరిగాయి. దీంతో బాధితులు గుండ్రెడ్డి గంగాధర్, గుర్రపు మహేశ్‌ల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాలతో అనుమానితుల కదలికలపై ఆరా తీశారు. సదాశివనగర్ మండలం కల్వరాల్ స్టేజీ వద్ద మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతుండగా పారిపోయేందుకు ప్రయత్నించిన ఓ నిందితుడిని పట్టుకుని విచారించారు. నిందితుడు జిల్లాలో చేసిన నేరాలను అంగీకరించినట్లు తెలిపారు.

రాజస్థాన్ పాసింగ్ కారులో తిరుగుతూ..

పోలీసులకు చిక్కిన సికిందర్ సోన్లాల్ దర్బార్, అతని స్నేహితులు సంజు, విశాల్, అభిషేక్, ప్యూస్, అనిల్, ఉమేశ్ బాయ్, గోవింద్ బాయ్, మరొకరు కలిసి ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ ముఠా రాజస్థాన్ నంబర్ ప్లేట్ ఉన్న కారును కొనుగోలు చేసి, దాంట్లో ప్రయాణిస్తూ కామారెడ్డి జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. చోరీలు చేసేందుకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేసుకునే క్రమంలోనే నిందితుడు పోలీసులకు చిక్కాడని పేర్కొన్నారు. నిందితుని నుంచి కారు, సెల్‌ఫోన్, కత్తి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐలు సంతోష్ కుమార్, శ్రీనివాస్, ఎస్సైలు పుష్పరాజ్, ఉస్మాన్, ఐటీ కోర్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది లక్ష్మీకాంత్, శ్రీనివాసు, మైసయ్య, శ్రావణ్, రవిలను ఎస్పీ అభినందించారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



పోశెట్టి (ఫైల్)

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్ గ్రామ చెరువులో గల్లంతైన శ్రీగంధం పోశెట్టి (62) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సుస్మిత తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పోశెట్టి సోమవారం ఉదయం ఏడు గంటల సమయంలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కొడుకు భూమేశ్ చెరువు వద్దకు వెళ్లి వెతికాడు. పోశెట్టి బట్టలు, చెప్పులు చెరువు కట్టపై కనిపించడంతో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం పోశెట్టి మృతదేహం నిజాంసాగర్ కెనాల్ గేట్ల వద్ద కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

బోధన్‌రూరల్: మద్యానికి బానిసైన ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సాలూర మండలం జాడిజమాల్‌పూర్ గ్రామానికి చెందిన వన్నెల జ్యోతి(35) భర్త ఆరేళ్ల క్రితం మృతి చెందాడు. గ్రామంలో చిన్న చిన్న పనులు చేసుకుంటు జీవిస్తోంది. కొంత కాలంగా ఆమె మద్యానికి బానిస కావడంతో అనారోగ్యానికి గురైంది. సోమవారం గ్రామ శివారులోని చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహం చెరువులో లభ్యం కావడంతో కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిరుతకు పోస్టుమార్టం



ఇందల్వాయి: మండలంలోని పడకల్ వద్ద వాహనం ఢీకొని మృత్యువాత పడ్డ నాలుగేళ్ల చిరుతకు పోస్టుమార్టం నిర్వహించి తిర్మన్‌పల్లి నర్సరీలో అంత్యక్రియలు నిర్వహించినట్లు డీఎఫ్‌వో వికాస్ మీనా, ఇందల్వాయి రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ భట్ మంగళవారం పేర్కొన్నారు. వాహనదారులు దట్టమైన అటవీ ప్రాంతంలో నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. జాతీయ రహదారుల అథారిటీకి ఇందల్వాయి రేంజ్ పరిధిలో ఉన్న దట్టమైన ఫారెస్ట్‌లో ఫెన్సింగ్, ఆరు అండర్ పాస్ లకు ప్రతిపాదనలు పంపినట్లు ఎఫ్‌ఆర్‌వో తెలిపారు.

పొలంలోకి ఆర్టీసీ బస్సు



రుద్రూర్: ఎదురుగా వస్తున్న స్కూల్ బస్సుకు సైడ్ ఇవ్వడానికి యత్నించి రోడ్డు కిందకు దించిన ఆర్టీసీ బస్సు పొలంలోకి వంగిపోయిన ఘటన మంగళవారం రుద్రూర్ మండలం అంబం(ఆర్) శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబం(ఆర్) నుంచి రుద్రూర్‌కు బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వస్తుండగా ఎదురుగా స్కూల్ బస్సు వచ్చింది. స్కూల్ బస్సుకు దారి ఇద్దామనే ప్రయత్నంలో ఆర్టీసీ డ్రైవర్ బస్సును పక్కకు తీశాడు. వర్షాలకు రోడ్డు పక్క మట్టి తడిసి ఉండడంతో ఒక్క సారిగా పొలంలోకి వంగిపోయింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ చాకచాక్యంగా వ్యవహరించి బస్సులోని ప్రయాణికులకు కిందకు దింపి వేశాడు. మరో బస్సులో ప్రయాణికులను పంపించి వేశారు.